క్లుప్తంగా

ఎంపీడీఓగా బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓ బాబ్జీరాజును అభినందిస్తున్న ఈవోపీఆర్డీ, కార్యదర్శులు తదితరులు

అమలాపురం రూరల్: మండల నూతన ఎంపీడీఓగా ఉండ్రు బాబ్జీ రాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆయన బదిలీపై అమలాపురం ఎంపీడీఓగా వచ్చారు. ఇప్పటివరకూ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా కొనసాగుతున్న మల్లిఖార్జునరావు తిరిగి ఈవోపీఆర్డీగా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా ఆయనకు ఈవోపీఆర్డీ మల్లిఖార్జునరావు, పంచాయతీ కార్యదర్శులు రుద్రరాజు ఆర్ఎస్ఎస్ సూరపరాజు, కె.వెంకటేశ్వరరావు, ప్రసాద్, రామశైలజ, బొర్రా ఆదిశంకరం, అనంతలక్ష్మి, ఏఓ కుమారి, కార్యాలయ ఉద్యోగులు శాస్త్రి, నాగేంద్ర, శ్రీనివాస్, ఆదినారాయణలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బీచ్‌కు ప్రత్యేక బస్ సర్వీస్ ప్రారంభం



ఎస్.యానం బీచ్ బస్ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం రూరల్: ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం బీచ్‌కు వెళ్లేందుకు ప్రత్యేక బస్సు సర్వీస్‌ను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చేతుల మీదుగా స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలాపురం నియోజకవర్గాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఆర్టీసీ డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ అమలాపురం నుంచి ప్రతి ఆదివారం బీచ్‌కు వెళ్లేందుకు ఉదయం నుంచి రాత్రి వరకూ ఆరుసార్లు బస్ సౌకర్యం ఉంటుందన్నారు. పర్యాటకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్తిబాబు, రాజు, నేతాజీ, రామకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి

అమలాపురం టౌన్: స్థానిక సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద 216 జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. బైక్‌పై వెళుతున్న వ్యక్తి ఓ కారును తప్పించబోయి రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళుతున్న లారీ వెనుక చక్రాలు ఆ వ్యక్తి కాళ్లపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ స్పందించి అంబులెన్స్‌ను రప్పించి క్షతగాత్రుడిని తక్షణమే స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈఓపీఆర్డీ నాగేంద్ర బాధ్యతల స్వీకరణ



ఈఓపీఆర్డీ నాగేంద్రకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: అల్లవరం మండల పరిషత్ నూతన ఈఓపీఆర్డీగా యు.నాగేంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యదర్శులంతా శుభాకాంక్షలు తెలిపారు. ఆయన కె.గంగవరం మండలంలో ఈఓపీఆర్డీగా బాధ్యతలు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా అల్లవరం ఈఓపీఆర్డీగా వచ్చారు. అనంతరం ఎంపీడీఓ కృష్ణమోహన్‌ని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లకు సోమవారం నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమంపై కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఈఓపీఆర్డీ అవగాహన కల్పించారు.

పశు వైద్యాధికారిణిగా మాధురి



అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక పశు వైద్యశాల వైద్యాధికారిణిగా డాక్టర్ మాధురి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నుంచి డిప్యూటేషన్‌పై బండారులంక వచ్చారు. జిల్లా పశువైద్యాధికారి వెంకట్రావు, సహాయ సంచాలకుడు ఎల్.విజయరెడ్డిలను ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు.

సత్తా చాటుతున్న యువ క్రీడాకారులు

- వెయిట్‌లిఫ్టింగ్‌లో అద్భుత ప్రదర్శన
- వివిధ పోటీల్లో పతకాలు కైవసం

యానాం: వారంతా యానాం శివారు సావిత్రినగర్, గిరియాంపేట మత్స్యకార గ్రామాల్లోని నిరుపేద కుటుంబాలకు చెందినవారే.. అయితేనేం ఒకపక్క చదువుకుంటూనే వెయిట్‌లిఫ్టింగ్‌ను నేర్చుకుని జాతీయస్థాయిలో సత్తా చాటుతున్నారు. కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది లేదని నిరూపిస్తున్నారు. సొంతంగా ప్రాక్టీస్ చేస్తూ లక్ష్యం వైపు దూసుకుపోతూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.

అవలీలగా బరువులెత్తేస్తున్నారు

సావిత్రినగర్, గిరియాంపేట గ్రామాల విద్యార్థులు పుదుచ్చేరి స్టేట్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్-2024 యూత్ సబ్ జూనియర్ బాలురు, బాలికల, జూనియర్ అండ్ సీనియర్(మెన్ అండ్ ఉమెన్) విభాగాల్లో సత్తా చాటి హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి వెయిల్‌లిఫ్టింగ్ పోటీలకు అర్హత సాధించారు. 30 కేజీల విభాగంలో సంగాడి దినేష్ ద్వితీయ, 40 కేజీల విభాగంలో పంతాడి గంగాద్రి ద్వితీయ, బాలికల విభాగంలో 40 కేజీల విభాగంలో సంగాడి లావణ్య, 35 కేజీల విభాగంలో మల్లాడి సూర్యకీర్తి ప్రథమ స్థానంలో, బాలుర విభాగం 49 కేజీల విభాగంలో తిరుమాడి నాగూరు, సంగాడి భైరవమూర్తి ప్రథమ, 67 కేజీల్లో దండుప్రోలు మోహన్, కాసు వెంకటేష్ ద్వితీయ, బాలికల 45 కేజీల్లో కర్రి కస్తూరి, 55 కేజీల విభాగంలో ధనకుమారి, 64 కేజీల విభాగంలో వాద్రేవు నీలిమ, 55 కేజీల్లో తిరుమాడి నాగూరు ద్వితీయ స్థానాలను సాధించారు. గతంలో వెయిట్‌లిఫ్టింగ్‌పై విద్యార్థుల ఆసక్తిని గమనించిన వెంకటేషన్ అనే తమిళ పీఈటీ వారి చేత పూర్తి స్థాయిలో సాధన చేయించి వెయిట్‌లిఫ్టింగ్‌లో పూర్తిస్థాయిలో రాణించేలా తీర్చిదిద్దారు. అయితే ఆయన కారైకల్‌కు బదిలీ కావడంతో వీరిలోని పెసింగి శివరామకృష్ణ అనే క్రీడాకారుడు మిగిలిన తన సహచర క్రీడాకారులను వెయిల్‌లిఫ్టింగ్‌లో అద్భుత ప్రదర్శన చేసేవారిగా తీర్చిదిద్దాడు.



పుదుచ్చేరి స్టేట్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో యానాం విద్యార్థిని ప్రతిభ

ఒకే పాఠశాల నుంచి ఎంతోమంది

వివిధ అంతరాష్ట్ర పోటీల్లో పతకాలు, ప్రశంసలు పొందిన ఈ క్రీడాకారులంతా స్థానిక గిరియాంపేట పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులే కావడం విశేషం. పుదుచ్చేరి, కారైకల్‌లో జరిగిన వెయిట్‌లిఫ్టింగ్ పోటీలతో పాటు పుదుచ్చేరి రాష్ట్ర వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లోను, ఇటీవలి జరిగిన పుదుచ్చేరి ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో, గౌహతిలో జరిగిన ఖేల్‌ఇండియా, పాట్నాలో జరిగిన యూత్ నేషనల్స్ పోటీల్లోను ఆయా గ్రామాలకు చెందిన యువతీ, యువకులు పాల్గొని పతకాలు సాధించారు. వెయిట్‌లిఫ్టింగ్‌లో తాము రాణించడానికి మాజీ మంత్రి, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అందించిన సహకారం మరువలేనిదని క్రీడాకారులు చెబుతున్నారు. తాము పోటీలకు దూరంగా వెళ్లాల్సి వచ్చినపుడు ప్రయాణ ఖర్చుల కోసం ఆర్థికంగా ఆయన ఎంతగానో సహకరిస్తున్నారన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న మల్లాడి

స్థానికంగానే సాధన



తీరప్రాంత గ్రామాల్లో చాలా మందిలో క్రీడా ప్రతిభ ఉంది. వెయిట్‌లిఫ్టింగ్ క్రీడలో ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి శిక్షణ ఇస్తున్నాను. స్థానికంగానే సాధన చేసి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నారు.

– పెసింగి శివరామకృష్ణ, సావిత్రినగర్

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

తాళ్లరేవు: సుంకరపాలెం పంచాయతీలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. శనివారం గ్రామ పంచాయతీలో సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామంలో నెలకొన్న సమస్యలను మొరపెట్టుకున్నారు. ప్రధానంగా బాబానగర్‌లో నూతనంగా నిర్మించిన తాగునీటి ట్యాంకు కింద మందుబాబులు మద్యం తాగి వ్యర్థాలను ట్యాంకులో పడేస్తున్నారని స్థానిక నాయకుడు వడ్డి ఏడుకొండలు తెలిపారు. అలాగే రామాలయం వద్ద రహదారి కుంగిపోయి వర్షం నీరు నిలిచిపోతుందని, శ్మశాన వాటికలో తాగునీటి సమస్య ఉందని మర్రి అశోక్, గుత్తుల వెంకటేశ్వర్లు, కావూరి ఉదయ్‌కుమార్, పలివెల రాము చెప్పారు. ఈ మేరకు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి జ్యోతిసుధకు వినతిపత్రం అందజేశారు. గుత్తుల శ్రీను, మోపూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం

తాళ్లరేవు: పర్యావరణానికి, ప్రజల ప్రాణాలకు చేటు తెస్తున్న ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని పలువురు వక్తలు అన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చొల్లంగిపేట శ్రీవివేకానంద హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.మహేష్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కారణంగా ప్రజలు అనేక ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. అలాగే ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా తీవ్ర కాలుష్యం పెరిగిపోయి పర్యావరణానికి, వన్యప్రాణులకు తీవ్ర నష్టం చేకూరుతుందన్నారు. కాకినాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలోనే రెండో అతిపెద్ద మడ అటవీ ప్రాంతమైన కోరంగి అభయారణ్యం సమీపంలో నివసించడం మన అందరి అదృష్టమన్నారు. కార్యక్రమంలో యూఎన్‌డీపీ జీసీఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ లక్కింశెట్టి శ్రీహర్ష, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వీరభద్రరావు, బీట్ ఆఫీసర్లు సుభాని, గోపి, ధనలక్ష్మి, సత్యనారాయణ, హెచ్ఎం ఎంటీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

నిధులున్నా పనులు చేయట్లేదు

– ఎల్జీతో సమావేశమైన ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులకు పుష్కలంగా నిధులున్నా అధికారులు పనులు ప్రారంభించట్లేదని పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె.కై లాషనాథన్‌కు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ వివరించారు. శనివారం ఆయన ఎల్జీతో సమావేశమై నియోజకవర్గంలో సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వివరించారు. యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో సేవలు అందించకుండా సీరియస్ కేసులన్నీ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేసేస్తున్నారన్నారు. 1996 తుఫానుకు నష్టపోయిన ఎస్సీ కుటుంబాలకు అప్పట్లో రూ.35 వేలతో రెండు గదుల ఇళ్లను నిర్మించారని, ప్రస్తుతం అవి శిథిల స్థితికి చేరుకున్నాయన్నారు. తక్షణం వాటిని సర్వే చేసి ఆదిద్రావిడశాఖ ద్వారా రూ.5 లక్షల చొప్పున గృహనిర్మాణ సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. గత రెండేళ్లుగా గోదావరి వరదలకు తీర గ్రామాల ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోయారని, నియోజకవర్గంలో వరదనీరు ప్రవహించకుండా ఏటిగట్టు చుట్టూ రక్షణగోడ నిర్మాణానికి పూనుకోవాలని కోరారు. నూతన రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న 400 మందికి కార్డులు జారీ చేయాలని అడిగారు. ప్రధానంగా కోట్లాది రూపాయల సీఎస్ఆర్ నిధులు మంజూరు చేసినా అధికారులు వాటిని అభివృద్ధి పనులకు ఉపయోగించకుండా మురిగిపోయేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



ఎల్జీ కైలాషనాథన్‌ను కలిసిన ఎమ్మెల్యే అశోక్

విజయభారతి ఆశయ సాధనకు కృషి చేయాలి

అమలాపురం రూరల్: బొజ్జా తారకం సతీమణి డాక్టర్ విజయభారతి ఆశయా సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని రిటైర్డ్ ఏపీపీ ఐఎన్ మల్లేశ్వరరావు సూచించారు. నడిపూడి డాబా గార్డెన్స్‌లో శనివారం జరిగిన విజయభారతి సంస్మరణ సభకు మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు జల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విజయభారతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ విజయభారతి అంబేడ్కర్ జీవిత చరిత్రను రచించిన గొప్ప రచయిత్రి అని కొనియాడారు. కార్యక్రమంలో పెనుమల చిట్టిబాబు, మట్టా వెంకటరావు, సాపే బాలరవి, బొంతు చంద్రరావు, గెద్దం భాస్కరరావు, భానుజీరావు, ఈవీవీ సత్యనారాయణ, బొంతు రమణ పాల్గొన్నారు.



విజయభారతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మల్లేశ్వరరావు తదితరులు

రీజెన్సీ తరలిపోయినట్లేనా....?

యానాం: యానాం రీజెన్సీ సిరామిక్స్ టైల్స్ పరిశ్రమ ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోయిందా..? అంటే అవుననే మాటలు వినిపిస్తున్నాయి. ఊహాగానాలకు బలం చేకూరుస్తూ శనివారం ప్రకాశం జిల్లా వేమవరం వద్ద రీజెన్సీ సిరామిక్స్ ఆపరేషన్ ఉత్పత్తి పనులను ఆ సంస్థల ఎండీ డాక్టర్ జీఎన్‌నాయుడు, సరోజినిదేవి దంపతులు ప్రారంభించారు. దసరా మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుధ పూజ సైతం నిర్వహించారు. దీంతో యానాంలో రీజెన్సీ పునఃప్రారంభిస్తారని ఎదురుచూస్తున్న స్థానిక ప్రజలకు నిరాశే మిగిలింది. పునఃప్రారంభానికి సుమారు రూ.25 కోట్లు పెట్టుబడి పెట్టిన సంస్థ యాజమాన్యానికి పుదుచ్చేరి ప్రభుత్వపరంగా సహాయ నిరాకరణతోనే ఏపీకి తరలిపోయినట్లు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అన్నపూర్ణాదేవి నమోస్తుతే

- అన్నపూర్ణ అలంకరణలో జగన్మాత
- భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమ పూజలు

తాళ్లరేవు: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా మూడో రోజైన శనివారం కనకదుర్గమ్మ అమ్మవారిని సకల జీవకోటికి ఆహారాన్ని అందించే అన్నపూర్ణాదేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని కోరంగి గ్రామంలో దుర్గామల్లేశ్వర శక్తి పంచాయతన అమ్మవారి ఆలయంలో అమ్మవారిని ఆలయ ప్రధాన అర్చకులు పెండ్యాల శ్రీరామ గోవిందశర్మ అన్నపూర్ణాదేవి అలంకరణలో పూజించారు. ఇంజరం హరశ్రీ నిలయంలో అర్చకులు కాకరపర్తి బాబీశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, శ్రీసూక్తం, దుర్గాసూక్తం, గాయత్రీ మంత్రం, ఆదిత్యాది నవగ్రహాలకు హోమం నిర్వహించారు.

భవానీల పడిపూజ

మండల కేంద్రమైన తాళ్లరేవు మాధవరాయునిపేటలో శనివారం భవానీ భక్తుల పడి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పోల్నాటి రామకృష్ణ ఇంటివద్ద గురు భవానీ ఖండవిల్లి కేశవాచార్యులు నేతృత్వంలో భవానీ మాల ధరించిన భక్తులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భవానీలు, భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మందపాటి సతీష్, నాయుడు నారాయణమూర్తి, ఏడుకొండలు, లోకేష్, మేడిశెట్టి శ్రీను, రామాంజనేయులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద శ్రీదేవి అమ్మవారు గాయత్రీదేవిగా అలంకృతమై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది.



పల్లవారిపాలెంలో అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



వీరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో భద్రకాళీ అమ్మవారు

స్థానిక గోల్డ్ మార్కెట్ వద్ద గల శ్రీకమాక్షి ఏకాంబరేశ్వరదేవి అమ్మవారి ఆలయంలో పట్టణ విశ్వబ్రాహ్మణ, స్వర్ణకారుల సంఘాల ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన జరిగింది. పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, పట్టణ బంగారు, వెండి వర్తకుల సంఘం అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.



గాయత్రీదేవిగా దర్శనమిస్తున్న అమలాపురం శ్రీదేవి అమ్మవారు



యానాంలో లలితాదేవి అలంకరణలో శారదాదేవి అమ్మవారు

ముమ్మిడివరం: దశమి శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా మూడవ రోజు శనివారం అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలో పల్లవారిపాలెంలో అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గోదశివారిపాలెంలో శ్రీవిజయదుర్గ అమ్మవారి ఆలయం, లక్ష్మీదేవిలంక, తానేల్లంక, అయినాపురంతో పాటు పలు గ్రామాల్లో అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



కోరంగి శ్రీదుర్గా మల్లేశ్వరశక్తి పంచాయతన ఆలయంలో అమ్మవారు

ఐ.పోలవరం: శ్రీవీరేశ్వరస్వామివారి ఆలయంలో శరన్నవరాత్ర మహోత్సవాల సందర్భంగా మూడో రోజు శనివారం విశేష పూలఅలంకరణలో భద్రకాళీ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యానాం: యానాంలో కొలువైన శ్రీశారదాదేవి సరస్వతీదేవి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా శనివారం శారదాదేవి అమ్మవారు లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా చేకూరి పద్మరాజు దంపతుల సౌజన్యంతో అమ్మవారి ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అదే విధంగా స్థానిక పడవలరేవు వీధిలో కొలువైన లలితాదేవి అమ్మవారు లలితాదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో రాత్రి హరికథా చూడామణి, రేడియో అండ్ టీవీ ఆర్టిస్ట్ పురాణం విజయలక్ష్మితో పార్వతీ కల్యాణం హరికథ అందరినీ అలరించింది.



అమలాపురంలో కామాక్షి ఏకాంబరేశ్వరదేవికి పూజలు చేసిన చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు



నీలపల్లిలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



పాతకోరంగి శివాలయంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



మాధవరాయునిపేటలో పడిపూజ చేస్తున్న భవానీలు

పెదవలసలలో ఇసుక ట్రాక్టర్ సీజ్

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ పెదవలసల గ్రామంలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ శనివారం తెలిపారు. పెదవలసల చెక్కల వంతెన ప్రాంతంలో నావపై ఇసుకను తెచ్చి ట్రాక్టర్‌పై తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. ఇసుకను రెవెన్యూ అధికారులు సీజ్ చేసి కార్యాలయానికి తరలించారని చెప్పారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరించారు.

ఘనంగా ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం

అమలాపురం టౌన్: స్థానిక గాంధీ బజార్‌లోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో చేతివృత్తుల కార్పెంటర్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. నాలుగు దశాబ్దాలుగా తెలుగు అధ్యాపకుడిగా సేవలు అందిస్తున్న నల్లా నరసింహమూర్తిని సంఘం ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకర, కన్వీనర్ పితాని బీబీరావు, మండల అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, గ్రంథాలయ అధికారి జీవీఆర్ ఎస్‌హెచ్‌కే వర్మ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

కాట్రేనికోన: మండలంలోని చింతలమెరక గ్రామంలో నూతన ఆలయలంలో విజయలక్ష్మీ దుర్గ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. సుదర్శనం వెంకట జనార్థనాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు పూజా కార్యక్రమాలు చేశారు. పుణ్యాహవచనం, ఋత్విగ్వరుణలు, దీక్షారాధన, సర్వదేవతా ప్రార్థనలు, చతుర్వేద పారాయణం, వాస్తు పూజ, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, శాంతి హోమాలను జరిపారు. కార్యక్రమంలో కముజు లక్ష్మీరమణారావు, వనచర్ల సత్యనారాయణమూర్తి, సంసాని అర్జున, సంసాని దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చండీ హోమం



వీరేశ్వరస్వామి ఆలయంలో చండీ హోమం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా మూడో రోజు శనివారం చండి హోమం నిర్వహించారు. దాతల సహకారంతో ఈ కార్యక్రమాలు ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో పూజలు జరిపారు. తొలుత గణపతి పూజ, పంచగవ్య ప్రాసన, చండీ హోమం అనంతరం పూర్ణాహుతి చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

సైబర్ నేరాలను అరికట్టాలంటూ వినతి



ఎస్పీ కృష్ణారావును మర్యాద పూర్వకంగా కలిసిన కోకో ఫెడ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లాలో తరుచూ జరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టాలని ఎస్పీ బి.కృష్ణారావును కోనసీమ కంజ్యూమర్ ఫెడరేషన్ (కోకో ఫెడ్) ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. కోకో ఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి, కార్యదర్శి ఆదిత్య కిరణ్ ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధులు నల్లా పెదకాపు, ఎంవీ రావు, అమలాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రవణం వేణుగోపాలరావు తదితరులు స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కృష్ణారావును శనివారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. అమలాపురం, కొత్తపేటల్లో ట్రాఫి క్ సమస్యను పూర్తి స్థాయిలో క్రమబద్ధీకరించాలని వారు ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. చివరిగా కోకో ఫెడ్ తరపున ఎస్పీ కృష్ణారావు ఘనంగా సత్కరించారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి

ఉప్పలగుప్తం: సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అధికారులకు సూచించారు. మండలంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి ఆధ్వర్యంలో శనివారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూకు సంబంధించి 8, ఎంపీడీవో 20, ఆర్‌డబ్ల్యూఎస్ 5, విద్యుత్ 8, ఆర్అండ్‌బీ 3, ఇరిగేషన్ 2, హౌసింగ్ 4 , మత్స్యశాఖ 2, పంచాయతీరాజ్ 9 అర్జీలు చొప్పున మొత్తంగా 61 అర్జీలు వచ్చాయని మండల పరిషత్ ఏఓ ఎం.మూర్తి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు అరిగెల నానాజీ, సర్పంచ్‌లు పెయ్యల రాజ్‌కుమార్, యర్రంశెట్టి రామచంద్రరావు, రవణం మధు, నిమ్మకాయల చల్లయ్యనాయుడు, సలాది శ్రీనువాసరావు, చిక్కం ఉమేష్, చిక్కం భీముడు తదితరులు పాల్గొన్నారు.